
బొంరాస్‌పేట: రంజాన్ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


తాండూరు: ఈద్గా వద్ద ముస్లింల నమాజ్

ఘనంగా రంజాన్

- ముగిసిన నెల రోజుల ఉపవాసాలు
- సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ప్రజాప్రతినిధులు

వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఆనంద్.

పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి..

బషీరాబాద్‌లో బీఆర్ఎస్ నేత శ్రీశైల్‌రెడ్డి..

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: నెల రోజుల రంజాన్ ఉపవాసాలు సోమవారం ముగియడంతో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఈద్ ఉల్ ఫితర్' (రంజాన్) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. తాండూరు పట్టణం చెన్‌గేశ్‌పూర్ మార్గంలోని ఈద్గా వద్దకు ముస్లిం వేలాది సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హైదారాబాద్ రోడ్డు ఖాంజాపూర్ గేటు సమీపంలో వందలాది మంది ముస్లీంలు నమాజ్ చేశారు. ముస్లిం మత పెద్దలు (ఖాజీలు) ఖురాన్ బోధనలను చదివి వినిపించారు. సామూహిక ప్రార్థన ఈద్గా వద్దకు ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో పాటు పట్టణ పుర ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి.. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రంజాన్ పండుగ సామరస్యానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అన్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని ఇందర్‌చేడ్ రోడ్డు మార్గంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పాల్గొని అందరికి మంచి జరగాలని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీశైల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి, నాయకులు నర్సిరెడ్డి, పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పరిగిలోని ఈద్గా వద్ద, దోమ మండల కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశు రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎ.సురేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పి.చంద్రయ్య, ఎస్.భాస్కర్, బి.రవికుమార్, క్రిష్ణ, పాలాది శ్రీనివాస్ ఉన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి అలంషాహి దర్గాను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ దర్శించుకున్నారు. వారితో పాటు బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గోపాల్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు కిరణ్‌పటేల్, రామస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పులుమామిడి గ్రామంలో చేసిన ప్రార్థనల్లో బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి పాల్గొన్ని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని వేడుకల్లో పాల్గొని ముస్లింలకు అలైబలైతో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వందల ఫీట్లు వేసినా చుక్క నీరు లేదు..

- తగ్గుతున్న భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు
- చేసిన కష్టం నేల పాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్నీ కష్టాలే

బొంరాస్‌పేట్, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అన్నింటా కష్టాలు ప్రారంభమయ్యాయని, ఆరు కాలం కష్ట పడి పండించుకున్న పంటలు నేడు నీటి నిల్వలు పడిపోయి పంటలు ఎండుతున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని లగచెర్ల గ్రామంలో రైతులు సంవత్సరం కాలం నుంచి ప్రభుత్వ వైఖరి కారణంగా భూములు పోతాయన ఆందోళనలో అన్నింటా నష్టాలను ఎదుర్కొంటే.. ఇప్పుడు నీటి కష్టాలతో అనావృష్టిని ఎదుర్కోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. ప్రభుత్వం వైఖరికి తోడు వాతావరణ పరిస్థితులు కూడా సహకరించడం లేదని దుద్యాల రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో పది సంవత్సరాల పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం నెల రోజులకే భూములు వట్టిపడి పోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి భూ దాహాన్ని సంతరించుకొంటున్నాట్లు పేర్కొన్నారు. దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో ఎండుతున్న వరి ఇతర పంటలతో రైతులు దిక్కుతోచనని పరిస్థితిలో

పశువులకు మేతగా వరిపంట

ఉన్నారు. పంటలను కాపాడుకునేందుకు లక్షలు రూపాయలు ఖర్చుచేసి 500ల ఫీట్ల వరకు బోరుబావులను తవ్వుకున్నా చుక్క నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన వరి పంటలు ఎండి బీటలు పారుతున్నాయని రాత్రి పగలు అనే తేడాలేకుండా ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి సాగుచేసుకున్నట్లు తెలిపారు. పంటలు చేతికొచ్చే చివరి దశలో భూగర్భ జలాలు తగ్గి కండ్లముందు పంటలు ఎండిపోవడం చూసి కండ్లలో నీరు ఆగడంలేదని వాపోతున్నారు. ఎండుతున్న పంటలను చేసేదేమీలేక పశువులు, మేకలు, గొర్రెలకు మేతగా వేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పది సంవత్సరాలపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటూ సంతోషంగా ఉన్నమని రైతులు పేర్కొన్నారు. సరైన సమయంలో పంటసాగుకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించి ఉంటే అప్పులు చేయకుండా సాగు చేసుకునే ఆస్కారం ఉండేదన్నారు. అటు రైతుభరోసా అందక.. ఇటువంటి అనావృష్టితో పంటలు పండక చాలా ఇబ్బందులను ఎదుర్కోంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే కరువును వెంటతీసుకొచ్చిందని, నీటిని కాపాడుకోవడానికి ఎంటువంటి చర్యలు చేపట్టని కారణంగా రైతులు పంట నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోపించారు. ఎన్నికల్లో సాగునీరిస్తామని రైతులను ఆశకు గురి చేసినట్లు తెలిపారు. ఎండిన పంటలను ప్రభుత్వం వ్యవసాయాధికారుల ద్వార క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టాన్ని అందించి రైతులను అదుకోవాలని కోరారు.

నష్టపరిహారం అందించాలి

భూగర్భ జలాలు తగ్గడంతో సాగుచేసిన వరిపంట ఎండిపొతున్నది. నాకు 3 ఎకరాల భూమి ఉంది అందులో మొత్తం వరిపంటను సాగుచేశాను. భూగర్భ జలాలు తగ్గడంతో రెండు ఎకరాల వరి పంట మొత్తం ఎండిపో యింది. ఇప్పుడు పశువులకు మేతగా ఉపయోగిస్తున్న ఇంక 15 నుంచి 20 రోజులు పంటకు నీరు అందిఉంటే పంటచేతికొచ్చేది.ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి అప్పుకూడా కూడా మీదపడింది.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పది సంవత్సరాలు వర్షాలు సంవృద్ధిగా కురిసేవి కేసీఆర్ రైతుబంధు ద్వారా రైతులకు పంటపెట్టుబడి సహాయంను అందించడం వలన అప్పులు చేయకుండా రెండు పంటలను సంతోషంగా పండించేవాడిని.

–బి.ఆశోక్, రైతు –లగచర్ల దుద్యాల్ మండలం

భూగర్భ జలాలు తగ్గడంతో పాటు విద్యుత్ సమస్యలు

భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో నేను నాలుగు ఎకరాలలో వరిపంటను సాగు చేశాను. వరిపంట చివరిదశలో ఉంది ఇంక 25 నుంచి 30 రోజులు నీరు అందించడంతో పంట చేతికి వచ్చేది.ఇప్పుడు ఎండిపోవడంతో పంటసాగు కోసం తీసుకువచ్చిన పెట్టుబడి అప్పు మాత్రమే మిగిలింది. భూగర్భ జలాలు తగ్గడంతోపాటు విద్యుత్ సమస్యలు కూడా పంటలు ఎండిపోవడానికి ప్రధానకారణం.వానగాలికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్థంభాలు నెలకొరిగాయి .దీంతో మోటార్లకు 10రోజులపాటు విద్యుత్ నిలిచిపోవడంతో 2.5ఎకరాలలో వరిపంట ఎండిపోయింది. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

–బోగమోని గోపాల్, రైతు –లగచర్ల దుద్యాల్ మండలం.

అర్కతల.. అస్తవ్యస్తం...

- అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ, ఎక్కడి చెత్త అక్కడే
- మిషన్ భరగీరథ నీళ్లు రాక నరకయాతన
- సమస్యల వలయంలో గ్రామస్తులు

చెత్త చెదారంతో అపరిశుభ్రంగా..

నవాబుపేట, మార్చి 31: సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.. నవాబుపేట మండలం అర్కతల గ్రామం..ఎక్కడి చెత్త అక్కడే... రోడ్లపై మురుగు నీరు... ఇలా అనేక సమస్యలు గ్రామంలో తాండవిస్తున్నాయి. గ్రామం పక్కనే ఉన్న చిన్నపాటి చెరువులోకి మురుగునీటి కాల్వల నీరు కలుస్తున్నా సంబంధిత అధికారులు చూసి చూడన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల యోగక్షేమాలు కూడా ప్రభుత్వానికి పట్టడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో గ్రామ పంచాయతికీ చెత్త ట్రాక్టర్, నీటి ట్యాంకర్ డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్ వంటి వాటిని ఏర్పాటు చేశారు. వీధుల్లోని రోడ్లపై అపరిశుభ్రత పరిస్థితి దయనీయంగా మారిందని, సంబంధిత అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. మీషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామ సెక్రటరీ దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లిన ఎలాంటి స్పందన రావడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు... సమస్యలను మాత్ర పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ భవనం కూడా నిర్మిస్తామని చెప్పి పునాదులు వేశారు పిల్లర్ల దశలోనే వదిలివేశారు.

పిల్లర్ల దశలోనే శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవన నిర్మాణ పనులు

అధికారులు ఎవ్వరిమాటా వినడం లేదు..

గ్రామ సమస్యలు ఏమి చెప్పినా అధికారులు వినడం లేదు.. కనీసం మంచినీళ్లు కూడా సరిగా సరఫరా కావడం లేదు. సర్పంచులు, ఉప సర్పంచులు ఉన్నప్పుడు సమస్యల పరిష్కారంపై వెంటనే స్పందించే వారు.. అధికారులు పనిచేయకపోవడం వల్ల ఊరంతా సమస్యల మయమైంది. గ్రామ పంచాయతీ అయితే పునాదులు మాత్రమే వేశారు దాన్ని పూర్తి చేసే వారు కరువైన్నారు.

– గంజాయి కిష్టయ్య

జీతాలు ఇవ్వడం లేదు..

ఇప్పటికి నాలుగు నెలలా జీతం పెండింగ్‌లో ఉంది. సెక్రటరీని అడిగితే బడ్జెట్ లేదు ఎపుడొస్తే అపుడు ఇస్తామని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఎంత చెప్పిన ప్రభుత్వం అన్న మా కష్టాన్ని గుర్తించి నిత్యవసరాలకు తగ్గట్టుగా జీతాలను పెంచి నెల నెలా సరిగ్గా ఇస్తే చాలు అదే మాకు కోట్లా రూపాయలతో సమానం. కనీసం రెండు నెలల జీతం ఇచ్చినా పండుగకు పస్తులుండాల్సిన బాధ తప్పేది.

– మహ్మద్‌జాఫర్, వాటర్ మెన్

మిషన్ భగీరథ నీళ్లు రాక నానా అవస్థలు ..

ఏ కాలం వచ్చినా నీటి సమస్య మాత్రం తప్పడంలేదు మాకు నళ్లాలు ఇస్తాము అంటూ పైపులు వేశారు ఖాళీ పైపులతో ఇంటి ఎదుట కూర్చోని చూడాలి తప్ప వాటిల్లో నీళ్లు మాత్రం రావడంలేదు ఇంటి పన్ను కట్టకపోతే కరెంట్ కట్‌చేస్తాము తప్పనిసరిగా కట్టాలి అని బెదిరింపులు చాలానే చేస్తారు అసలైన సమస్యలను పట్టించుకోరు. మాకు నీటి సమస్య ఉందని చెప్పని అధికారి లేడు ఇప్పటికైనా నీటి సమస్యను తీర్చి ఆదుకోవాలలి

–ఊరడీ సత్తమ్మ

మా ఇంటి పక్కనే పెద్ద మురుగు ఉంది..

మా ఇళ్లు చెరుకు దగ్గర ఉన్న ప్రాంతంలో ఉంది అనేక రకాలైన చెత్త చెదారంతో పాటు రోడ్డుపై మురుగు నీరు పారుతూనే ఉంటుంది. ఈ సమస్యను తాము గ్రామ పంచాయతీ సెక్రటరీ దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లిన కూడా పరిష్కరించడంలేదు .మా వార్డులో అసలు మంచినీటి వసతి లేదు చెరువులోనుంచి పైపులు వేసి మోటర్ల ద్వారా డ్రమ్ములు, సంపులు నింపులకుని అవసరాలకు వాడుకుంటున్నాము. అండర్ డ్రైనేజీ అయితే మరి అధ్వానం రోడ్డు పక్కనే పైపును వదిలి వేయగా అవి చెరువులోకి వేళేదారిలో వెళ్తున్నాయి.

– ఈరప్పాలా శేఖర్

నిరుపయోగంగా రైతు వేదికలు

తాండూరు రూరల్, మార్చి 31: రైతులు ఓ చోట చేరి వారి సమస్యలతోపాటు పంటల సాగు పై చర్చించుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. తాండూరు మండలం, అంతారం, నారాణపూర్, సిరిగిపేట, బెల్కటూర్, కరణ్‌కోట, చెంగోల్ గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించారు. ఒక్కోదానికి రూ.22 లక్షల చొప్పున రూ.కోటి 54 లక్షల నిధులో పూర్తి చేశారు. 33 పంచాయతీలను 7 క్లస్టర్లుగా విభజించిచి నిర్మించారు. రైతులు ఆయా గ్రామాల వారీగా సమావేశమై నేలను బట్టీ పంటలు సాగు చేసుకోవాలనే అంశాలపై చర్చించుకోవాల్సి ఉంది. వ్యవసాయాధికారులు గ్రామ రైతుబంధు సమితిలతోపాటు మండల రైతు బంధు సమితీ కన్వీనర్లను కూడా అప్పట్లో ఏర్పాటు చేశారు. ఆయా రైతు వేదికలకు గత ప్రభుత్వం ఫర్నీచర్, టీవీలను సమకూర్చారు. పంటల రకాలు, పంటలపై ఆశించే పురుగు నివారణ చర్యల గురించి చర్చించుకునేందు రైతు వేదికలను ఉపయోగించుకోవా ల్సి

సిరిగిపేటలోని రైతు వేదిక

ఉంది. రైతు సంక్షేమ దృష్ట్యా నిర్మించిన రైతు వేదికలు ప్రస్తుతం వాటి వైపు వ్యవసాయాధికారులు కన్నెత్తి చూడడంలేదు. 7 క్లస్టర్లలో నిర్వహణ సరిగ్గా లేక రైతు వేదికలకు తాళాలు వేశారు. వాటిని ఉపయోగంలోకి తీసుకు రావాలిని రైతులు కోరుతున్నారు.

ఇంట్లో చోరీ

9 తులాల బంగారం, అరకిలో వెండి దొంగతనం

పరిగి, మార్చి 31: వేసవికాలం కావడంతో కుటుంబసభ్యులంతా స్లాబ్ పై భాగంలో నిద్రిస్తుండగా దొంగలు ఓ ఇంటికి కన్నం వేశారు. పరిగి మండలం హనుమాన్ గండి తండాకు చెందిన ముడావత్ శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఎప్పటివలె ఇంటికి తాళం వేసి స్లాబ్‌పై నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో దొంగలు ఇంటి తాళం విరగ్గొట్టి, ఇంట్లోని బీరువా తాళాలు విరగ్గొట్టి అందులోని 9 తులాల బంగారం, అరకిలో వెండి, సుమారు రూ.60వేల నగదు, ఒక సెల్‌ఫోన్ దొంగిలించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లేందుకు రావడంతో తలుపులు తెరిచి ఉండడంతోపాటు లైట్లు వేసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం సైతం విరగ్గొట్టబడి ఉన్నది. వెంటనే కుటుంబ సభ్యులందరినీ పిలవగా వారు వచ్చి చూసి అవాక్కయ్యారు. ఇదిలావుండగా మరో గదిలో ఉన్న బీరువా దగ్గరకు వెళ్లకపోవడం గమనార్హం. ఈ మేరకు క్లూస్ టీం సభ్యులు ఆనవాళ్లు సేకరించారు. పరిగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

కులకచర్లలో మరో ఘటన..

కులకచర్ల: తాళం వేసిన ఇంటిలో నగలు దొంగతానికి గురైన సంఘటన కులకచర్ల మండల కేంద్రంలో జరిగింది. కులకచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కులకచర్ల గ్రామానికి చెందిన మహమ్మద్ అమీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె ఇంటిలో బీరువాలో పెట్టిన మూడు మాసాల బంగారు పట్టీలు, మూడు మాసాల బంగారు కమ్మలు బుట్టలు, బంగారు మాటీలు ఒక మాసం, మంగళసూత్రం అరతులం, 10తులాల వెండిచైనాలు, అదే విధంగా 10తులాల కాళ్ల వెండిచైనాలు వీటన్నింటిని బీరువాలో పెట్టి హైదరాబాద్ వెళ్లింది. ఆమె కూతురు కూడా సోమవారం హైదరాబాద్ నుంచి తిరిగి ఇంటికి వచ్చిందని ఆమె వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయని, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరావా తాళాలు పగుల గొట్టి నగలు గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి హత్య

ఎల్బీనగర్, మార్చి 31 : కర్మన్‌ఘాట్‌లో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్‌లోని జానకి ఎన్‌క్లేవ్‌లో బచ్చు వెంకటేశ్వర్లు (47) నివాసం ఉంటూ డైలీ ఫైనాన్స్ చేస్తుంటాడు. ఇతను అందులోనే ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆమెకు కుమారుడు పవన్ , కూతురు ఉన్నారు. పవన్ ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. వెంకటేశ్వర్లు ప్రతి రోజూ మహిళను, ఆమె కొడుకు, కూతురిని అసభ్యకరమైన పదాలతో తిట్టేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వెంకటేశ్వర్లు.. మహిళ, ఆమె కొడుకుతో గొడవ పడ్డాడు. దాదాపు రాత్రి 12:40 గంటలకు వెంకటేశ్వర్లుపై పవన్ కత్తితో దాడిచేశాడు. వెంకటేశ్వర్లు వెంటనే పోలీసులకు ఫోన్ చేసి.. పవన్ తనను కొడుతున్నాడని చెప్పాడు. పోలీసులు అక్కడికి వెళ్లేసరికి పవన్ పారిపోయాడు. పోలీసులు గాయపడిన వెంకటేశ్వర్లును ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను చనిపోయినట్లు ధ్రువీకరించారు.

ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన యువకుడికి సన్మానం

కులకచర్ల, మార్చి 31: చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామానికి చెందిన ఈడ్గి సునీల్ రెండు రోజుల క్రితం వచ్చిన ఆర్మీ ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో ఈడ్గి సునీల్‌ను చౌడాపూర్ మండల బీఆర్ఎస్ నాయకుడు మఠం రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం సన్మాణించారు. తమ గ్రామానికి చెందిన యువకునికి ఆర్మీలో ఉద్యోగం వచ్చి దేశసేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా యువకున్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక

బషీరాబాద్, మార్చి 31 : మండల పరిధిలోని ఎక్మాయి గ్రామ మాల మహానాడు నూతన అధ్యక్షుడిగా మాల శ్రీమంతు ఎన్నికయ్యారు. మాజీ ఎంపీటీసీ కాశప్ప ఆధ్వర్యంలో సోమవారం నూతన గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా మాల శ్రీమంతు, ఉప అధ్యక్షులుగా లక్మారి శామప్ప, కార్యదర్శులుగా మాల రవీందర్, కోశాధికారిగా లక్మారి తిమ్మప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాల మహానాడు పెద్దలు, యువకులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కులకచర్ల, మార్చి 31 : మండల పరిధిలోని బిందెంగడ్డతండాలో రూ ఐదు లక్షలతో ఉపాధిహామీ పథకం నిధులచే నిర్మించే సీసీ రోడ్డు పనులను కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తండాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ నిధుల ద్వారా సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ భరత్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో

అంతరాయం

తాండూరు, మార్చి 31: తాండూరు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు కరెంటు ఉండదని తాండూరు విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 220 కేవీ ట్రాన్స్కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయడంతో విద్యుత్‌ను తాండూరు మున్సిపల్ పరిధిలో నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగ దారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★Wanted Service Boys & Security Guards to work in Twin Cities. Salary: 15,000/- + ESI & PF. Free Accommodation for Service Boys. Age: up to 35 years. Contact No. 9133377644/45/48.
NT-330673
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కులకచర్ల, మార్చి 31 : మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో గ్రామానికి చెందిన చెంచు హన్మయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు పలువురు నాయకులు ఆర్థిక సాయం అందించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ఐదు వేలు, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అందడగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, గ్రామ అధ్యక్షుడు హన్మంతు, మాజీ సర్పంచ్ బాలయ్య, డీలర్ లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పీరంపల్లి శ్రీనివాస్, హన్మంతు. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962